ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక



## జూనియర్ డాక్టర్ల
# సమ్మె విరమణ

న్యాయమైన డిమాండ్లను నెరవేరుస్తామన్న ప్రభుత్వం
3 మెడికల్ కాలేజీలకు
రూ. 204.85 కోట్ల నిధులకు ఉత్తర్వులు జారీ
ఉస్మానియా మెడికల్ కాలేజీలో
లేడీస్ హాస్టల్ నిర్మాణానికి రూ. 80 కోట్ల
నిధులను విడుదల చేస్తున్నామన్న
మంత్రి దామోదర రాజనర్సింహా
ఆరోగ్య శాఖ మంత్రికి కృతజ్ఞతలు తెలిపిన జూడాలు

2లో..

సంపుటి: 2 | సంచిక: 77 | పేజీలు: 4 | వెల: రూ.3/- | గురువారం 27 జూన్ 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్

## కేంద్రమంత్రి గడ్కరీతో
# సీఎం రేవంత్ భేటీ

### మంత్రులతో కలిసి పలు అంశాలపై చర్చ
రోడ్ ప్రాజెక్టులపై పవర్ పాయింట్ ప్రజంటేషన్
ఆర్ఆర్ఆర్ సహా అనేక ప్రాజెక్టులను క్లీయర్ చేయాలని వినతి



న్యూఢిల్లీ, జూన్ 26 (ప్రభాత ఉదయం): రీజనల్ రింగ్ రోడ్డు సహా తెలంగాణలో రోడ్డు ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేసేలా చూడాలని సెం రేవంత్ రెడ్డి కేందరమంత్రి నితన్ గడ్కరిని కోరారు. అనేక ప్రాజెక్టులు పెండింగ్‌లో ఉ న్నాయని వాటిని త్వరగా క్లీయర్ చేయాలని కోరారు. కేంద్రమంత్రి నితిన్ గడ్కారీ తో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు బుధవారం సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో రాష్ట్రానికి సంబంధించిన ప్రధాన సమస్యలపై చర్చించారు. ఈ భేటీకి సంబంధించిన అంశాలను మీడియాకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడించారు. ఈ క్రమంలో ఆర్ఆర్ఆర్ పై తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క కీలక ప్రకటన చేశారు. తెలంగాణకు కావాల్సిన రోడ్ల నెట్‌వర్క్‌కు కావాల్సిన అంశాలపై ప్రెజెంటేషన్ ఇచ్చినట్లు తెలిపారు. తెలంగాణలో రోడ్డు నెట్‌వర్క్ విస్తరణ పైన సుదీర్ఘంగా నితిన్ గడ్కరీతో చర్చించామని తెలిపారు. రీజినల్ రింగ్ రోడ్డు పనులు త్వరితగతిన చేపట్టే అంశంపై చర్చించామన్నారు. విజయవాడ రోడ్డును ఆరు లైన్లుగా మారుస్తామని ప్రకటించారు. హైదరాబాద్ కల్వకుర్తి రోడ్డుపై చర్చించామన్నారు. వారం రోజుల్లో అన్ని శాఖలతో కలిపి మరో సమావేశం పెడతామని తెలిపారు. అన్ని శాఖల నుంచి ఒకేసారి క్లియరెన్స్ వచ్చేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ÷ఖజనల్ రింగ్ రోడ్డుపై లోతుగా చర్చించామని.. వారు దానికి అంగీకరించారని వివరించారు. విజయవాడ - హైదరాబాద్ రోడ్డుకు టెండర్లను పిలిచేందుకు అంగీకరించారని చెప్పారు. హైదరాబాద్ - కల్వకుర్తి రోడ్లు, ఇతర రోడ్లపై చర్చ జరిగిందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి కావాల్సిన అన్ని సహాయక సదుపాయాలు కలిపిస్తామని ..మిగతా 2లో



## లోక్‌సభ స్పీకర్‌గా
# ఓం బిర్లా

### మూజువాణి ఓటుతో రెండోసారి బాధ్యతలు
అభినందించిన ప్రధాని మోడీ, విపక్షనేత రాహుల్

న్యూఢిల్లీ, జూన్ 26 (ప్రభాత ఉదయం): లోక్‌సభ స్పీకర్‌గా మరోసారి ఓంబిర్లా గెలుపొందారు. బుధవారం జరిగిన ఓటింగ్‌లో ఇండియా కూటమి అభ్యర్థి కె.సురేశ్‌పై ఓం బిర్లా గెలుపొందారు. మూజువాణీ ఓటుతో ఓంబిర్లా విజయం సాధించినట్లు ప్రొటెం స్పీకర్ బర్తృహరి మహతాబ్ ప్రకటించారు. ఉదయం సభ ప్రారంభం కాగానే ఎన్డీయే కూటమి తరఫున లోక్‌సభ స్పీకర్‌గా ఓం బిర్లా పేరును ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రతిపాదిస్తూ సభలో తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ తీర్మానాన్ని రాజ్‌నాథ్ సింగ్ సహా మంత్రులు, ఎన్డీయే ఎంపీలు బలపరిచారు. మరోవైపు ఇండియా కూటమి తరఫున కె.సురేశ్ పేరును శివసేన (యుబిటి) ఎంపీ అరవింద్ సావంత్ తీర్మానం చేశారు. దీన్ని పలువురు విపక్ష ఎంపీలు బలపర్చారు. అనంతరం ..మిగతా 2లో

# ఢిల్లీకి చేరిన జీవన్ రెడ్డి వ్యవహారం

### అదిష్టానం పిలుపుతో హస్తినకు వెళ్లిన తాటిపర్తి




న్యూఢిల్లీ, జూన్ 26 (ప్రభాత ఉదయం): కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి ఆ పార్టీ నేతల బుజ్జగింపులు కొనసాగుతు న్నాయి. ఇప్పటికే మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ తదితరులు ఆయనతో మాట్లాడారు. తాజాగా దిల్లీకి రావాలని ఆ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి దీపాదాస్ మున్షీ నుంచి పిలుపు వచ్చింది. ఈ విషయంపై ఆమె జీవన్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు. ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌తో కలిసి ఆయన దిల్లీ బయలుదేరారు. ఇటీవల భారాస ఎమ్మెల్యే సంజయ్ కాంగ్రెస్‌లో చేరడంతో జీవన్‌రెడ్డి మనస్తాపానికి గురయ్యారు. ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తానని, కాంగ్రెస్ పార్టీలో మాత్రం కొనసాగుతానని ప్రకటించారు. మరోవైపు ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇప్పటికే దిల్లీ చేరుకున్నారు. ఈ క్రమంలో రాజీనామాకు సిద్ధమైన కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డికి ఢిల్లీ అధిష్టానం నుంచి పిలుపు రాగా, విప్ అడ్లూరి లక్ష్మణ్ తో కలసి ఢిల్లీ వెళ్లారు. అధ్యక్షుడు ఖర్గేతో పాటు కేసి వేణుగోపాల్ ను కలవనున్నారు. ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డితో పాటు డిప్యూటీ సీఎం భట్టి,ఉత్తమ్,కోమటి రెడ్డి, సీతక్క, పొంగులేటి ఢిల్లీలోనే ఉన్నారు. తనకు కనీస సమాచారం లేకుండా జగిత్యాల బీఆర్ఎస్ ఎమ్మెల్యే ..మిగతా 2లో

# పఠాన్‌కోట్‌లో ఉగ్రవాదుల సంచారం

### భద్రతాదళాల గాలింపు ముమ్మరం

న్యూఢిల్లీ, జూన్ 26 (ప్రభాత ఉదయం): భారత వాయుసేన కీలక స్థావరం ఉన్న పఠాన్ కోట్ జిల్లాలో భారీ ఆయుధాలతో ఇద్దరు ఉగ్రవాదులు సంచరిస్తున్నట్లు భద్రతా దళాలు గుర్తించాయి. దీంతో బుధవారం జిల్లాలో హైఅలర్ట్ ప్రకటించారు. పలు గ్రామాల్లో దళాలు గాలింపు చర్యలు చేపట్టాయి. బోర్డర్ రేంజి డీఐజీ రాకేశ్ కుశాల్ మాట్లాడుతూ గత రాత్రి అనుమానాస్పద కదలికలను గుర్తించినట్లు పేర్కొన్నారు. దీంతో ఆ ప్రాంతాన్ని పూర్తిగా చుట్టుముట్టినట్లు ..మిగతా 2లో





## తిరుమల శ్రీవారి భక్తులకు
# గుడ్‌న్యూస్

### గదులపై టీటీడీ కీలక నిర్ణయం
తిరుమలలో వసతి గదులపై ఈవో సమీక్ష
తరచూ గదులు తీసుకునే వారి జాబితా
నివేదిక ఇవ్వాలని అధికారులకు ఆదేశం

తిరుపతి,జూన్ 26(ప్రభాత ఉదయం): తిరుమలలో లోటుపాట్లపై ఫోకస్ పెట్టారు ఈవో జే శ్యామలరావు.వరుసగా విభాగాలవారీగా సమీక్షలు చేస్తున్నారు.తాజాగా తిరుమలలో వసతి గదులపై సమీక్ష నిర్వహించారు.తిరుమలలో వసతి గదుల్ని తరచూ తీసుకుంటున్న వారి జాబితాను సిద్ధం చేయాలని ఈవో శ్యామలరావు అధికారులను ..మిగతా 2లో

## బోనాల జాతరకు
# రూ.20 కోట్లు మంజూరు



హైదరాబాద్,జూన్ 26(ప్రభాత ఉదయం): తెలంగాణలో ఆషాఢ బోనాల ఉత్సవాలనుల ఈ ఏడాది ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఇందుకోసం ఉత్సవాల కోసం ప్రభుత్వం రూ.20 కోట్లు మంజూరు చేసింది. ఈ విషయాన్ని మంత్రి కొండా సురేఖ వెల్లడించారు. దేవదాయశాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్ ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా ఈ ఉ త్సవాలను నిర్వహించాలని దేవాదాయ శాఖ అధికారులను మంత్రి కొండా సురేఖ ఆదేశించారు. గోల్కొండ కోటలో బోనాల జాతర ఉత్సవాలపై మంత్రులు కొండాసురేఖ, పొన్నం ప్రభాకర్ సమీక్ష నిర్వహించారు. మీటింగ్‌కి అటెండ్ కానీ అధికారులపై మంత్రి కొండా సురేఖ సీరియస్ అయ్యారు. మీటింగ్‌కు రాని అధికారులకు మెమోలు ఇష్యూ చేయాలని ఆదేశించారు. లక్షల మంది జరుపుకునే పండుగకు సంబంధించి మీటింగ్ పెడితే. మంత్రులు, మేయర్ వస్తే అధికారులు రారా అని ప్రశ్నించారు. గోల్కొండ కోటలో 9 వారలు బోనాలు సమర్పించే భక్తులకు అన్ని రకాల ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు మంత్రి. ప్రతి ఆదివారం, మంగళవారం, గురువారం భక్తులు వస్తారని తెలిపారు.



జలమండలి నూతన ఎండి అశోక్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న పూర్వ ఎండి సుదర్శన్ రెడ్డి

## జలమండలి ఎండీగా
# అశోక్ రెడ్డి బాధ్యతల స్వీకరణ

### జలమండలి నూతన ఎండీగా అశోక్ రెడ్డి ప్రధాన కార్యాలయంలో బాధ్యతల స్వీకరణ
ఘన స్వాగతం పలికినఅధికారులు, ఉద్యోగలు

హైద్రాబాద్,జూన్ 26(ప్రభాత ఉదయం) జలమండలి నూతన మేనేజింగ్ డైరెక్టర్ గా అశోక్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. బుధవారం ఉదయం 10.15 గంటల సమయంలో ఖైరతాబాద్ లోని ప్రధాన కార్యాలయానికి వచ్చిన ఆయనకు..జలమండలి ఉన్నతాధికారులు,ఉద్యోగులు ఘన స్వాగతం పలికారు.పుష్పగుచ్ఛాలిచ్చి శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం మేనేజింగ్ డైరెక్టర్ ఛాంబర్ లో ఇప్పటిదాకా ఎండీగా పని చేసిన సుదర్శన్ రెడ్డి నుంచి ఆయన ఛార్జ్ తీసుకున్నారు.గతంలోనూ జలమండలితో అనుబంధం అశోక్ రెడ్డికి ఇప్పటికే జలమండలితో ..మిగతా 2లో

ప్రభాత ఉదయం తెలుగు దినపత్రిక

# జిహెచ్ఎంసి నూతన కమిషనర్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన ఆమ్రపాలి కాట



జిహెచ్ఎంసి నూతన కమిషనర్ ఆమ్రపాలకి పూల మొక్కను అందజేస్తున్న పూర్వపు కమిషనర్ రోనాల్డ్ రోస్



జిహెచ్ఎంసి కమిషనర్‌గా పదవి బాధ్యతలు స్వీకరించిన ఆమ్రపాలి



జిహెచ్ఎంసి నూతన కమిషనర్ ఆమ్రపాలికి బాధ్యతలు అప్పజెప్తున్న పూర్వపు కమిషనర్ రోనాల్డ్ రోస్

హైదరాబాద్, జూన్ 26(ప్రభాత ఉదయం)జిహెచ్ఎంసి నూతన కమిషనర్ గా బుధవారం ఐఏఎస్ అధికారిని ఆమ్రపాలి కాట బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్రంలో ఐఏఎస్ ల బదిలీల నేపథ్యంలో జిహెచ్ఎంసి కమిషనర్ రోనాల్డ్ రోస్ ను బదిలీ చేస్తూ, ఆయన స్థానంలో ఆమ్రపాలి కాట కు జిహెచ్ఎంసి కమిషనర్, ఎఫ్ ఎ సి గా ప్రభుత్వం నియమించింది. ఆ మేరకు రోనాల్డ్ రోస్, నుండి ఆమె బాధ్యతలను స్వీకరించారు. అనంతరం బాధ్యతలు స్వీకరించిన కమిషనర్ ఆమ్రపాలిని జిహెచ్ఎంసి ఉన్నతాధికారులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలని అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, కూకట్ పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ్ చౌహాన్, శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి లు కమిషనర్ ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.



## కేంద్రమంత్రి గడ్కరీతో సీఎం రేవంత్ భేటీ

మొదటి పేజీ తరువాయి...

నితిన్ గడ్కారీకి చెప్పామని అన్నారు. వారం రోజుల్లో హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో అన్నిశాఖల అధికారులతో సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. తెలంగాణ అభివృద్ధికి సహకరిస్తున్న నితిన్ గడ్కారీకి ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ధన్యవాదాలు తెలిపారు. కేంద్రమంత్రి నితిన్ గడ్కరీతో పలు విషయాలపై చర్చించామని రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. రోడ్లు, భూ సమస్యలను బీఆర్ఎస్ ప్రభుత్వం పరిష్కరించలేదని మండిపడ్డారు. హైదరాబాద్, అమరావతి రెండు రాజధానుల మధ్య ఆరు లైన్ల రోడ్డు నిర్మిస్తున్నామని ... రెండు నెలల్లో పనులు ప్రారంభిస్తామని ప్రకటించారు. అలాగే ఎక్స్‌ప్రెస్‌వే కూడా నిర్మిస్తామని చెప్పారు. శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్ నిర్మిస్తామన్నారు. ఎన్నికలు అయిపోయాయి, రాజకీయాలు పక్కనపెట్టి అభివృద్ధి కోసం పని చేస్తామని స్పష్టం చేశారు. చాలా రోడ్ల సమస్యలపైన ఈరోజు క్లారిటీ వచ్చిందన్నారు. ఉప్పల్ ఘట్‌కేసర్ ఫ్లై ఓవర్‌ను ఏడాదిన్నరలో పూర్తి చేస్తామని వివరించారు. తెలంగాణ అభివృద్ధి మాత్రమే ముఖ్యమని.. తమ మధ్య ఎలాంటి రాజకీయాలు లేవని, అందరం బాగానే ఉన్నామని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పేర్కొన్నారు.



## పఠాన్‌కోట్‌లో ఉగ్రవాదుల సంచారం

మొదటి పేజీ తరువాయి...

తెలిపారు. ఇప్పటికే బీఎస్ఎఫ్, సహా అన్ని సెక్యూరిటీ ఏజెన్సీలకు అలర్ట్‌లు జారీ చేశామన్నారు. పఠాన్‌కోట్ ఎస్ఎస్పీ సుహైల్ ఖాసీం మిర్ ఈ వివరాలను వెల్లడిస్తూ.. ఇద్దరు సాయుధులు కోట్ భట్టియాన్ గ్రామ పరిసరాల్లో సంచరిస్తున్నట్లు గుర్తించాం. ఈ ప్రాంతం జమ్మూ కశ్మీర్‌లోని కథువా జిల్లాతో సరిహద్దులు పంచుకొంటోంది. ఈ అనుమానితులే కథువాలోని కోట్ పన్నూలో కూడా సంచరించినట్లు తెలిసింది' అని వెల్లడించారు. ఈ నెల 12వ తేదీన పాక్ నుంచి కథువా జిల్లా సుక్‌పాల్ గ్రామంలోకి చొరబడిన ఇద్దరు అనుమానితులను భద్రతా దళాలు కాల్చిచంపాయి. 2016 జనవరిలో పఠాన్‌కోట్‌లోని వాయుసేన స్థావరంపై ఉగ్రవాదులు విరుచుకుపడ్డారు. అప్పట్లో కూడా వారు తొలుత వీధుల్లో తిరుగుతూ వాహనాలను హైజాక్ చేసి ఎయిర్‌ఫోర్స్ బేస్‌లోకి ప్రవేశించారు. ఆ తర్వాత అక్కడే భారీగా పెరిగిన గడ్డిలో నక్కారు. తెల్లవారుజామున సిబ్బంది క్వార్టర్స్‌లోకి ప్రవేశించి దాడి చేసి పలువురి ప్రాణాలను బలిగొన్న విషయం తెలిసిందే. వీరిని పూర్తిస్థాయిలో మట్టుబెట్టడానికి కొన్ని రోజులు వాయుసేన, ఇతర భద్రతా దళాలు శ్రమించాల్సి వచ్చింది. నాడు ఎయిర్‌ఫోర్స్ కీలక ఆయుధ సంపత్తికి ఎటువంటి నష్టం జరగకపోవడమే పెద్ద ఊరట.

## జలమండలి ఎండీగా అశోక్ రెడ్డి బాధ్యతల స్వీకరణ

మొదటి పేజీ తరువాయి...

అనుబంధం ఉంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ఆయన రెండేళ్లపాటు జలమండలిలో పనిచేశారు. 2009 నుంచి 2011 మధ్య కాలంలో ఆయన జలమండలి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ), ఫైనాన్స్ డైరెక్టర్ గా సేవలు అందించారు. తర్వాత 2012 నుంచి 2014 వరకు జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ గా పనిచేశారు. 2019లో 9 నెలల పాటు మూసీ రివర్ డెవలప్ మెంట్ అథారిటీ మేనేజింగ్ డైరెక్టర్ గానూ పని చేసిన అనుభవమూ ఆయన సొంతం. ఇప్పటి దాకా ఎండీగా పని చేసిన సుదర్శన్ రెడ్డి..సాధారణ పరిపాలన శాఖకు బదిలీపై వెళ్లారు. ఆయన గతేడాది డిసెంబరు 18న జలమండలి ఎండీగా బాధ్యతలు చేపట్టారు. దాదాపు 7 నెలలు ఆ బాధ్యతలు నిర్వర్తించారు.

## తిరుమల శ్రీవారి భక్తులకు గుడ్‌న్యూస్

మొదటి పేజీ తరువాయి...

ఆదేశించారు. అంతేకాదు పదేపదే గదులు తీసుకుంటూ భక్తుల సౌకర్యాలను దుర్వినియోగం చేస్తున్న దళారులను గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమగ్ర నివేదిక అందజేయాలని అధికారుల్ని ఈవో ఆదేశించారు. ఈ సమీక్షలో వసతి విభాగం అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తిరుమలలో ఎన్ని గదులు అందుబాటులో ఉన్నాయి. ఎంత మంది యాత్రికులకు వసతి కల్పించవచ్చు అనే అంశాలపై ఈవోకు వివరించారు. సీడీ రీఫండ్, దళారులను గుర్తించడంతో పాటు వారిని నియంత్రించే మార్గాలు, తిరుపతిలో అందుబాటులో ఉన్న వసతి, కొత్తగా నిర్మాణంలో ఉన్న పిఏసిలు, ఇతర సంబంధిత అంశాలపై ఈవో సమీక్షించారు. అనంతరం పదే పదే వసతి పొందుతున్న వారి వివరాలు, గదులు సక్రమంగా ఖాళీ చేయకపోవడం, ఇతర సమస్యలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈ సమావేశంలో వసతి విభాగం డిప్యూటీ ఈవోలు హరీంద్రనాథ్, భాస్కర్..ట్రాన్స్‌పోర్ట్ (జీఎం) శేషారెడ్డి, ఐటీ జీఎం సందీప్ రెడ్డి, ఓఎస్డీ సత్రే నాయక్, ఏఈవో (కంప్యూటర్స్) వెంకటేశ్వర్లు నాయుడు, ఇతర అధికారులు పాల్గొన్నారు. టీటీడీ ఈవో బాధ్యతలు చేపట్టిన ఈవో జే శ్యామలరావు వరుసగా సమీక్షలు నిర్వహిస్తున్నారు. లోటుపాట్లను గమనించి వాటిని సరిచేసే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పుడు గదుల అంశంపై కూడా ఫోకస్ పెట్టారు. ముగిసిన శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు..అప్పలాయగుంట శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో తొమ్మిది రోజుల పాటు జరిగిన వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం రాత్రి ధ్వజావరోహణంతో ముగిశాయి. రాత్రి 7 గంటలకు ధ్వజావరోహణ ఘట్టం నిర్వహించారు. గరుడ పటాన్ని అవనతం చేసి ధ్వజారోహణం నాడు ఆహ్వానించిన సకల దేవతలను సాగనంపారు. బ్రహ్మోత్సవాలలో పాలు పంచుకునే వారు సమస్త పాపవిముక్తులై, ధనధాన్య సమృద్ధితో తులతూగుతారని ఐతిహ్యం. అప్పలాయగుంట శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో చివరి రోజైన మంగళవారం ఉదయం చక్రస్నానం వైభవంగా జరిగింది. ఇందులో భాగంగా ఉదయం 9.15 నుంచి 10.45 గంటల వరకు పుష్కరిణి ఎదురుగా స్నపన తిరుమంజనం చేపట్టారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, పసుపు, చందనం, కొబ్బరినీళ్లతో అభిషేకం చేశారు. అనంతరం పుష్కరిణిలో చక్రస్నానం నిర్వహించారు. అర్చకులు, అధికారులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు నవసంధి, మాడవీధి ఉత్సవం నిర్వహిస్తారు. రాత్రి 7 నుంచి 7.30 గంటల మధ్య ధ్వజావరోహణం జరుగనుంది. ధ్వజావరోహణంతో స్వామివారి బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి.

## ఢిల్లీలో తెలంగాణ ప్రతినిధిగా జితేందర్ రెడ్డి

### బాధ్యతలు స్వీకరించిన మాజీ ఎంపి



న్యూఢిల్లీ, జూన్ 20 (ప్రభాత ఉదయం): ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా జితేందర్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన.. సీఎం రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వానికి వారధిగా ఉంటానన్నారు. విభజన చట్టంలో పెట్టిన అంశాలపై కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. తెలంగాణను స్పోర్ట్స్ హబ్‌గా తీర్చి దిద్దేందుకు ప్రయత్నం చేస్తామన్నారు. కృష్ణా నుంచి రావాల్సిన నీటి వాటా కూడా రాలేదన్నారు. సాగునీరు, త్రాగు నీరు సాధించడం కోసం రాజీలేని పోరాటం చేస్తానని చెప్పారు. బీబీనగర్ ఎయిమ్ విషయంలో కూడా కేంద్రం చాలా అంశాలను పెండింగ్ లో పెట్టిందని తెలిపారు. కేంద్రంలోని అన్ని మంత్రిత్వ శాఖలపై ఒత్తిడి తెస్తాం.. ఎన్నో పెండింగ్ సమస్యలు ఉన్నాయన్నారు. ఏపీ భవన్ విషయంలో ఎటువంటి అనుమతి అవసరం లేదన్నారు. ఢిల్లీలో తెలంగాణ భవన్ నిర్మాణం కోసం కసరత్తు మొదలైందన్నారు. త్వరలోనే ఢిల్లీలో తెలంగాణాకు కొత్త భవనం నిర్మాణం జరుగుతోందని చెప్పారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్చార్జి దీపాదాస్ మున్షీ, మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, ఎంపిలు మల్లురవి, రఘురామి రెడ్డి, బలరాం నాయక్, చామల కిరణ్ కమార్ రెడ్డి, ఎమ్మెల్యేలు వివేక్, యన్నం శ్రీనివాస్ రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి, శ్రీహరి, మాజీ మంత్రి జానారెడ్డి హాజరయ్యారు.

## తెలంగాణకు నిధులు రాబట్టడమే లక్ష్యం

### రహదారుల ప్రాజెక్టులపై గడ్కరీతో చర్చించా

### రాష్ట్రమంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వెల్లడి

న్యూఢిల్లీ, జూన్ 20 (ప్రభాత ఉదయం): కేంద్రం నుంచి తెలంగాణకు రావాల్సిన నిధులను సాధించడమే తమ లక్ష్యమని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. అందుకోసమే వరుసగా కేంద్రమంత్రులను కలుస్తున్నామని అన్నారు. రాష్ట్రంలోని వివిధ రహదారుల ప్రాజెక్టుల విషయమై దిల్లీలో కేంద్రమంత్రి నితిన్ గడ్కరీతో చర్చించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. జాతీయ రహదారులకు సంబంధించి గత అయిదేళ్లలో తెలంగాణకు అతి తక్కువ నిధులు వచ్చాయి. భూసమీకరణ, ఇతర అంశాలను అప్పటి రాష్ట్ర ప్రభుత్వం పెడచెవిన పెట్టింది. దాంతో పనులు ఆగిపోయాయి. 2016లో ప్రకటించిన రీజినల్ రింగ్‌రోడ్డును మరిచిపోతే మా ప్రభుత్వం వచ్చిన తరువాత కదలిక తీసుకొచ్చాం. యుటిలిటీ ఛార్జీలను భరిస్తామని చెప్పాం. కేంద్రమంత్రి గడ్కరీ స్పందించి తామే భరిస్తామని భరోసా ఇచ్చారు. 50-50 షేరింగ్‌లో భూసమీకరణ ప్రారంభించాలని తాజా సమావేశంలో నిర్ణయించామని అన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలకు ఉపయోగకరమైన 6 లేన్ గురించి కూడా చర్చించాం. రెండేళ్లలోపే విజయవాడ-హైదరాబాద్ మార్గాన్ని రూ.4వేల కోట్ల బడ్జెట్‌తో పూర్తి చేయనున్నామని, ఏపీ విభజన చట్టం ప్రకారం గ్రీన్‌ఫీల్డ్ హైవేకు రూపకల్పన చేస్తున్నట్లు కేంద్రమంత్రి వెల్లడించారు. అన్ని వినతులపై కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారు. తెలంగాణకు రావాల్సిన నిధులన్నీ సాధించడమే మా లక్ష్యం. జవాబుదారీతనంగా పని చేయడం మాకు తెలుసు కాబట్టే ఇంత మంది మంత్రులం దిల్లీకి వచ్చి మాట్లాడుతున్నాం. ఉప్పల్-ఘట్‌కేసర్ రహదారి విస్తరణ పనులు నత్తనడకన సాగుతున్న నేపథ్యంలో వాటిని త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం' అని కోమటిరెడ్డి తెలిపారు.

## ఢిల్లీకి చేరిన జీవన్ రెడ్డి వ్యవహారం

మొదటి పేజీ తరువాయి...

సంజయ్ కుమార్‌ను కాంగ్రెస్‌లోకి తీసుకోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైన సీనియర్ నేత, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి రెండు రోజులుగా రాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వంపై అసంతృప్తిగా ఉన్నారు. దీంతో తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయడానికి సిద్ధమయ్యారు. అయితే జగిత్యాలలో ఉన్న జీవన్ రెడ్డిని మంత్రి శ్రీధర్ బాబు, విప్‌లు ఆది శ్రీనివాస్, అడ్లూరి లక్ష్మణ్ కలిసి బుజ్జగించారు. అయినా వెనక్కి తగ్గని జీవన్ రెడ్డి జూన్ 25న హైదరాబాద్ వచ్చారు. ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసి, ఆ లేఖను మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డికి ఇవ్వాలని నిర్ణయించుకున్నారు. ఇదే విషయాన్ని చైర్మన్ కు ఫోన్ ద్వారా జీవన్ రెడ్డి సమాచారం ఇచ్చారు. కానీ చైర్మన్ నల్గొండ జిల్లా టూర్ లో ఉండడంతో జూన్ 26 రాజీనామా లేఖ ఇవ్వాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో ఢిల్లీ కాంగ్రెస్ అధిష్టానం నుంచి ఫోన్ రావడంతో జీవన్ రెడ్డి, విప్ అడ్లూరితో కలిసి ఢిల్లీ వెళ్లారు. జగిత్యాల ఇష్యూతో కాంగ్రెస్ హైకమాండ్ అలర్ట్ అయింది. ఇక నుంచి చేరికల విషయంలో జాగ్రత్తగా ఉండాలని పీసీసీ నాయకత్వాన్ని ఢిల్లీ పెద్దలు ఆదేశించారు. చేరికలతో పార్టీకి బలం పెరగాలి తప్ప, కొత్త సమస్యలు రావద్దని రాష్ట్ర నేతలకు సూచించారు. జీవన్ రెడ్డిని బుజ్జగించి సమస్యకు వెంటనే ముగింపు పలకాలని ఆదేశించారు. ఇక ముందు చేరికల సమయంలో సంబంధిత నియోజకవర్గాల నేతలకు సమాచారం ఇవ్వాలని అధిష్టానం సూచించినట్టు సమాచారం. అలాగే, చేరికలపై పీసీసీ నాయకత్వానికి హై కమాండ్ దిశా నిర్దేశర చేసినట్టు తెలిసింది.

## జూనియర్ డాక్టర్ల సమ్మె విరమణ

హైదరాబాద్, జూన్ 26 (ప్రభాత ఉదయం): తెలంగాణ ప్రభుత్వంతో జూడాల చర్చలు సఫలమయ్యాయి. ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ హామీతో జూడాలు ఎట్టకేలకు సమ్మె విరమించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ, జూడాలతో తాను రెండు సార్లు చర్చించానని తెలిపారు. వైద్య శాఖలో జూడాలు ఎదుర్కొంటున్న సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామన్నారు. జూడాలు అడిగిన ఎనిమిది డిమాండ్లలో ఆరు డిమాండ్లకు మంత్రి సానుకూలత వ్యక్తం చేశారు, ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వం రెండు జీవోలను జారీ చేసింది. ఉస్మా నియా, గాంధీ ఆసుపత్రుల జూడాల వసతిగృహాల నిర్మాణానికి ఒక జీవో విడుదల చేసింది. కాకతీయ వైద్య కళాశాలలో రహదారుల పునరుద్ధరణద్ధ కు నిధులు విడుదల చేస్తూ మరో జీవో జారీ విడుదల చేసింది. ఉస్మానియా, గాంధీ ఆసుపత్రులతో పాటు కాకతీయ వర్సిటీకి రూ. 204. కోట్లు కేటాయించింది ప్రభుత్వం. ఉస్మానియా వసతి భవనాలు, రోడ్లకు రూ. 121.90 కోట్లు , గాంధీ ఆసుపత్రికి రూ. 79. 50 కోట్లు కాకతీయ యూనివర్సిటీ లోని సీసీ రోడ్లకు రూ. 2. 75 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. తాత్కాలికంగా తెలంగాణలో జూనియర్ డాక్టర్లు సమ్మె విరమిస్తున్నట్లు ప్రకటించారు. ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహాకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా జూనియర్ డాక్టర్లు మాట్లాడుతూ జూడాల సమస్యలను అర్థం చేసుకున్నందుకు ఆరోగ్య శాఖ మంత్రి రాజనర్సింహాకు, సీఎం కు ప్రభుత్వానికి వారు ప్రత్యేక కృత్ఞతలు తెలిపారు. ప్రభుత్వం ముందు పెట్టిన న్యాయమైన డిమాండ్లను వారు నెరవేరుస్తామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు..మొత్తం 3 మెడికల్ కాలేజీలకు సంబంధించిన 204.85 కోట్ల రూపాయల నిధులకు ఉత్తర్వులను జారీ చేసినట్లు మంత్రి వివరించారు. ఉస్మానియా మెడికల్ కాలేజీలో లేడీస్ హాస్టల్ నిర్మాణానికి 80 కోట్ల రూపాయలు విడుదల చేస్తున్నామని తెలిపారు.

## ఫిరాయింపుల చట్టం అపహాస్యం

### సిఎం రేవంత్ తీరుపై మండిపడ్డ జగదీశ్ రెడ్డి

హైదరాబాద్, జూన్ 20 (ప్రభాత ఉదయం): పార్టీ ఫిరాయింపుల చట్టం తెచ్చిన కాంగ్రెస్ పార్టీ.. ఇవాళ సిగ్గు లేకుండా ఫిరాయింపులను ప్రోత్సహిస్తోందని, సీఎం రేవంత్ రెడ్డి ఎమ్మెల్యేల ఇంటింటికి వెళ్లి కండువాలు కప్పుతున్నాడని సూర్యాపేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి మండిపడ్డారు. పార్టీ ఫిరాయింపుల అంశంపై తెలంగాణ భవన్‌లో జగదీశ్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. పార్టీ ఫిరాయింపుల చట్టం తెచ్చిందే కాంగ్రెస్ పార్టీ. పార్టీ ఫిరాయింపులు మంచిది కాదు.. దీన్ని మనం పూర్తిగా వ్యతిరేకిస్తున్నాం. చట్టాన్ని మరింత బలోపేతం చేస్తాం. ఫిరాయింపు జరిగిన రోజే.. లోక్‌సభలో కానీ, రాజ్యసభలో కానీ, అసెంబ్లీలో కానీ ఆ అభ్యర్థి యొక్క సభ్యత్వం రద్దయ్యే విధంగా చట్టం తీసుకువస్తామని మొన్నటి ఎన్నికల్లో హామీ ఇచ్చారు. పాంచ్ న్యాయ్ సూత్రాల్లో కూడా దాన్ని చేర్చారు. ప్రజలు కూడా కాంగ్రెస్ మేనిఫెస్టోను చూసి ఓట్లు వేశారు. ఓట్లు వేసిన ప్రజలను కూడా కాంగ్రెస్ పార్టీ మోసం చేస్తోంది. ఇలాంటి సిగ్గుమాలిన పని కాంగ్రెస్ పార్టీ చేయకూడదు అని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి స్పష్టంగా చెబుతున్నారు. దానికి వ్యతిరేకంగా జీవన్ రెడ్డి రాజీనామాకు కూడా సిద్ధపడ్డారు అని జగదీశ్ రెడ్డి గుర్తు చేశారు. 2018 అసెంబ్లీ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు ఎమ్మెల్యేలు చట్టం ప్రకారం మేం విలీనం అవుతాం అని చెప్పారు. ఆ మేరకు సీఎల్పీని చట్టబద్ధంగా విలీనం చేశారు. కేసీఆర్ ఎలాంటి ఉల్లంఘనకు పాల్పడలేదు. మీ సభ్యులకే మీ పార్టీపై విశ్వాసం లేక 23 మంది ఎమ్మెల్యేల మెజార్టీతో విలీనం చేశారని కోర్టు చెప్పింది. ఇవాళ్నేమో సిగ్గులేకుండా ఇంటింటికి వెళ్లి కండువాలు కప్పి ఆహ్వానిస్తున్నారు రేవంత్ రెడ్డి. కేసీఆర్ ఎవరికీ కండువాలు కప్పలేదు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు స్వచ్ఛందంగా నాడు బీఆర్ఎస్‌లో చేరారు అని జగదీశ్ రెడ్డి గుర్తు చేశారు.

## లోక్‌సభ స్పీకర్‌గా ఓం బిర్లా

మొదటి పేజీ తరువాయి...

స్పీకర్ పదవికి ఎన్నిక చేపట్టారు. మూజువాణీ ఓటుతో చేపట్టిన ఈ ఎన్నిక పక్రియలో ఓం బిర్లా విజేతగా నిలిచారు. స్పీకర్‌గా ఎన్నికైన ఓంబిర్లాకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అభినందనలు తెలిపారు. అనంతరం ఓంబిర్లాను మోదీ, రాహుల్, కిరణ్ రిజుజు సాదరంగా సభాపతి స్థానం వద్దకు తీసుకెళ్లి స్పీకర్ కుర్చీలో కూర్చోబెట్టారు. స్పీకర్ పదవికి ఈ సారి ఎన్నిక అనివార్యమైన విషయం తెలిసిందే. స్పీకర్ ఎన్నికను ఏకగ్రీవం చేసేందుకు బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే సర్కారు ప్రతిపక్షాలతో జరిపిన చర్చలు ఫలించలేదు. డిప్యూటీ స్పీకర్ పదవిని ఇవ్వాలన్న షరతుకు ప్రభుత్వం అంగీకరించకపోవడంతో స్పీకర్ స్థానానికి విపక్ష ఇండియా కూటమి అభ్యర్థిని నిలిపింది. ఇండియా కూటమి తరఫున సీనియర్ ఎంపీ కొడికున్నిల్ సురేశ్ బరిలో నిలిచారు. దీంతో గత 50 ఏండ్లలో తొలిసారిగా, స్వతంత్ర భారత చరిత్రలో మూడోసారి లోక్‌సభ స్పీకర్ పదవికి ఎన్నిక జరిగింది. ఈ క్రమంలో 18వ లోక్‌సభ స్పీకర్‌గా మరోసారి బీజేపీ ఎంపీ ఓం బిర్లా ఎన్నికయ్యారు. వరుసగా రెండోసారి లోక్‌సభ స్పీకర్‌గా ఎన్నికై చరిత్ర సృష్టించారు. బుధవారం లోక్‌సభలో జరిగిన ఎన్నిక పక్రియలో ఇండియా కూటమి అభ్యర్థిపై మూజువాణి ఓటుతో విజయం సాధించారు. ఓం బిర్లా కోటా-బుండి లోక్‌సభ స్థానం నుంచి మూడోసారి ఎంపీగా ఎన్నికయ్యారు. 2019లో ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని మోదీ 2.0 ప్రభుత్వంలో లోక్‌సభ స్పీకర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈసారి కూడా ఉన్‌డిఎ ఆయనను లోక్‌సభ స్పీకర్ అభ్యర్థిగా ప్రకటించింది. ఇతర పార్టీలు కూడా బయటి నుండి ఓం బిర్లాకు మద్దతు పలికారు. దీంతో ఓం బిర్లా రెండవసారి లోక్‌సభ స్పీకర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఓం బిర్లా వరుసగా రెండు పర్యాయాలు లోక్‌సభ స్పీకర్‌గా పనిచేసిన రాజస్థాన్‌కు చెందిన బలరాం జాఖర్‌తో సమానంగా నిలిచి చరిత్ర సృష్టించారు. ఇప్పటి వరకు లోక్‌సభ స్పీకర్‌గా వరుసగా రెండుసార్లు ఎన్నికై తన పదవీకాలాన్ని పూర్తి చేసుకున్న ఏకైక లోక్‌సభ స్పీకర్‌గా బలరాం జాఖర్ నిలిచారు. తెలుగు వారైన నీలం సంజీవరెడ్డి, జిఎంసి బాలయోగి వంటి అనుభవజ్ఞులైన నాయకులు, సంగ్మా కూడా రెండుసార్లు లోక్‌సభ స్పీకర్ అయినప్పటికీ 5 సంవత్సరాల పదవీకాలాన్ని పూర్తి చేయలేకపోయారు. బలరామ్ జాఖర్ 1980 నుండి 1985 వరకు తిరిగి 1985 నుండి 1989 వరకు తన రెండు పర్యాయల పదవీకాలాన్ని పూర్తి చేశారు. ఇక రెండు పర్యాయాలు లోక్‌సభ చేసిన వారిలో ఎం.ఏ. అయ్యంగార్ ప్రథముడు. స్వాతంత్ర భారత దేశంలో మొట్ట మొదటి లోక్‌సభ డిప్యూటీ స్పీకర్ అయిన అయ్యంగార్, మార్చి 8, 1956 నుండి మే 10, 1957 వరకు స్పీకర్‌గా పనిచేశారు. ఆపై మళ్లీ మే 11, 1957 నుండి ఏప్రిల్ 16, 1962 వరకు ఎన్నికయ్యారు. లోక్‌సభ తొలి స్పీకర్ గణేశ్ వాసుదేవ్ మావలంకర్ మరణం తర్వాత అయ్యంగార్ తొలిసారి స్పీకర్ అయ్యారు. అయ్యంగార్ సభాపతిగా ఆమోదించిన మైలురాయి చట్టాలలో వరకట్న నిషేధ చట్టం ఒకటి. ఇక తర్వాత డాక్టర్ గుర్దియాల్ సింగ్ ధిల్లాన్ ఆగస్టు 8, 1969న మొదటిసారిగా లోక్‌సభ స్పీకర్



అయ్యారు. మార్చి 17, 1971 వరకు ఆ స్థానంలో కొనసాగారు. స్పీకర్‌గా అతని రెండవ పదవీకాలం మార్చి 22, 1971న ప్రారంభమై డిసెంబర్ 1, 1975 వరకు కొనసాగింది. ఓం బిర్లా విషయానికి వస్తే, ఇప్పటివరకు పోటీ చేసిన ఆరు ప్రధాన ఎన్నికల్లో అజేయంగా నిలిచారు. 2019లో బీజేపీ ఆయనను లోక్‌సభ స్పీకర్‌గా చేసి అందరినీ ఆశ్చర్యపరిచింది. రెండోసారి ఎంపీ అయిన బిర్లా లోక్‌సభ స్పీకర్ కావడం అప్పట్లో సంచలనం సృష్టించింది. ఇక మరోసారి ఓం బిర్లాను ఎన్డీయే అభ్యర్థిని చేసింది.

# ఏబీవీపి ఆధ్వర్యంలో విద్యా సంస్థల బంద్ విజయవంతం






శంషాబాద్. జూన్ 26. ప్రభాత ఉదయం. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల్ని పరిష్కరించాలని, ప్రైవేట్, కార్పోరేట్ విద్యాసంస్థల్లో ఫీజులను నియంత్రించాలని ఈరోజు ఏబీవిపి రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలల బంద్ కు పిలుపు ఇవ్వడం జరిగింది.దీనిలో భాగంగా బుధవారం శంషాబాద్ మండలం లో ఉన్న ప్రభుత్వ మరియు ప్రైవేటు పాఠశాలలను బంద్ చేయించారు .ఈ కార్యక్రమంలో శంషాబాద్ జిల్లా కన్వీనర్ చాకలి మహేష్ మాట్లాడుతూ రేవంత్ రెడ్డి సర్కారు విద్యారంగం పై సవతి తల్లి ప్రేమ చూపెడుతూ విద్యారంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారు అని ఆవేదన వ్యక్తం చేశారు.పాఠశాలలు ప్రారంభం అయి పది నుంచి పదిహేను రోజులు పూర్తయిన ఇంత వరకూ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించక పోవడం సిగ్గు చేటని, ప్రభుత్వ పాఠశాలల్లో కనీస, మౌళిక వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు అని తెలిపారు.ప్రైవేట్, కార్పోరేట్ విద్యాసంస్థల్లో లక్షలకు లక్షలు ఫీజులు వసూలు చేస్తూ విద్యా వ్యాపారాలకు పాల్పడుతుంటే ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది అని తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం కార్పోరేట్ విద్యాసంస్థలకు తొత్తులుగా మారి పరోక్షంగా వారికి సహకరిస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో కనీస సౌకర్యాలు కల్పించకుండా, ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయకుండా ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తూ పేదలకు ఉచిత విద్య అందకుండా చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రైవేట్, కార్పోరేట్ విద్యాసంస్థల్లో ఫీజులను నియంత్రించాలని, ప్రభుత్వ నిబంధనల కు విరుద్ధంగా ప్రైవేటు పాఠశాలల్లో బుక్స్, స్టేషనరీ, యూనిఫాం, షూస్ పేర్లతో చేస్తున్న వ్యాపారాన్ని అరికట్టాలి అని, ప్రభుత్వ పాఠశాలల్లో కనీస, మౌళిక సదుపాయాలు కల్పించాలని, మెగా డీఎస్సీ ద్వారా 25వేల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని,విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో పేదల కోసం 25 సీట్లు కేటాయించాలని, ఖాళీగా ఉన్న డీఈవో,ఎంఈవో పోస్టు భర్తీ చేయాలని,ప్రభుత్వ పాఠశాలల్లో అటెండర్,పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా కో కన్వీనర్ మణికంఠ, రాష్ట్ర కో కన్వీనర్ ప్రదీప్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అఖిల్, పవన్, చరణ్, చందు, సురేష్, చరణ్, శివ, తిరుపతి, దినేష్, అఖిల్, తదితరులు పాల్గొన్నారు.




## కష్టపడి పనిచేసిన వారిని గుర్తించాలి

### నామినేటెడ్ పోస్టులు కల్పించాలి...

### తెలంగాణ రాష్ట్ర ఎన్ ఎస్ యు ఐ ప్రధాన కార్యదర్శి గొల్ల జాన్

కూకట్‌పల్లి, జూన్ 26 (ప్రభాత ఉదయం): విద్యార్థి నేత తెలంగాణ రాష్ట్ర ఎన్ ఎస్ యు ఐ ప్రధాన కార్యదర్శి గొల్ల జాన్ బుధవారం అఖిల భారత ఇంచార్జి కన్హయ్య కుమార్ జీ. జాతీయ అధ్యక్షుడు వరుణ్ చౌదరి, జాతీయ కార్యాలయంలోని న్యూ ఢిల్లీలో తెలంగాణ రాష్ట్ర ప్రెసిడెంట్ మరియు ఎంఎల్ సీ వెంకట్ బల్మూరి తెలంగాణ ఆఫీస్ బేరర్లతో కలిశారు. తదుపరి చేయవలసిన కార్యకలాపాల గురించి చర్చించారు. గత 10 సంవత్సరాలుగా కష్టపడి పనిచేసిన వారిని గుర్తించాలని, పనిచేవారికి నామేటెడ్ పోస్టలలో వసతి కల్పించేలా తెలంగాణ ప్రభుత్వానికి సూచించేలాని వారిని అభ్యర్థించారు.



ఎమ్మెల్యే కృష్ణారావుకు వినతి పత్రం అందజేస్తున్న కాలనీవాసులు

## చెరువులలో పేరుకుపోయిన గుర్రపు డెక్కను వెంటనే తొలగించాలి

### బస్తీలలో దోమల నివారణకు తగు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేకు వినతి...

### కాలనీలలో దోమల వ్యాప్తికి వాకింగ్ నిర్వహణ చేపట్టాలి..

కూకట్‌పల్లి, జూన్ 26 (ప్రభాత ఉదయం) కూకట్ పల్లి నియోజకవర్గం పరిధిలోని కాముని చెరువు, మైసమ్మ చెరువు, ముల్లకత్వ చెరువుల్లో కలుషిత జలాల వల్ల పేరుకు పోయిన గుర్రపుడెక్కతో విపరీతమైన దోమలతో పగలు రాత్రి తేడా లేకుండ వాటి బారిన పడి రోగాల పాలవుతున్న చెరువుల చుట్టు పక్కల ఉన్న 2572 కుటుంబాలు దాదాపు 10 వేలపై చిలుకు జనాభా కలిగిన రెయిన్బో విస్టాస్ రాక్ గార్డెన్, 1290 కుటుంబాలు 4 వేల పైచిలుకు జనాభా, రెయిన్బో విస్టాస్ ఫేస్1 450 కుటుంబాలు దాదాపు 2 వేల జనాభా , చుట్టుపక్కల కాలనీలైన సేవాలాల్ నగర్, రాఘవేంద్రనగర్, కైత్లాపూర్, మైస్టిక్ హిల్స్, సప్దార్ నగర్, ఆంజనేయ నగర్, గాయత్రినగర్ కాలనీల దోమల సమస్య , కైత్లాపూర్, సేవాలాల్ నగర్ మధ్య ఉన్న ఇరుకైన రోడ్డు విస్తరణ కు నోచుకోక తద్వార నిత్యం విపరీతమైన ట్రాఫిక్ సమస్య కు పరిష్కారం చూపమని స్థానిక శాసనసభ్యులు మాధవరం కృష్ణరావును కలిసి వినతిపత్రం అందజేసిన రేయిన్బో విస్టాస్ అధ్యక్షులు బండి మధుసూదన రెడ్డి, రామిడి. ప్రమోద్ రెడ్డి, టి.రామ్ కిరణ్, పూసపాటి దీప్తి తదితరులు పాల్గొన్నారు.




అవార్డు అందుకుంటున్న డాక్టర్ వీర సురేష్

## రాజేంద్రనగర్‌లోని కూరగాయల పరిశోధన స్థానానికి ఉత్తమ పరిశోధనా స్థానంగా అవార్డు


బుద్వేల్, జూన్26(ప్రభాత ఉదయం): శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం కు అనుబంధంగా ఉన్న రాజేంద్రనగర్ లోని కూరగాయల పరిశోధన స్థానానికి జాతీయస్థాయిలో 2023-24 సంవత్సరానికి గాను ఉత్తమ పరిశోధన స్థానంగా అవార్డు దక్కింది. ఈనెల 25 నుంచి 27 వరకు గుజరాత్ లోని నవసారి లో జరుగుతున్న అఖిల భారత సమన్వయ పరిశోధన పథకం(దుంప పంటలు) వార్షిక సమావేశాలలో ఈ అవార్డును కూరగాయల పరిశోధన స్థానం కు చెందిన డాక్టర్ వీర సురేష్ అందుకున్నారు. దేశం నలుమూలల నుంచి వచ్చిన 30 పరిశోధన కేంద్రాలలో రాజేంద్రనగర్ కు అవార్డు రావడం పట్ల ఉద్యాన విశ్వవిద్యాలయం పరిశోధన సంచాలకులు డాక్టర్ కిరణ్ కుమార్, దక్షిణ తెలంగాణ వ్యవసాయ వాతావరణ ప్రాంత జోనల్ హెడ్ డాక్టర్ సురేష్ కుమార్ రెడ్డి, కూరగాయల పరిశోధనా స్థానం అధిపతి డాక్టర్ అనిత కుమారి లు హర్షం వ్యక్తం చేశారు.




హెల్ప్ డెస్క్ ను ప్రారంభిస్తున్న డిప్యూటీ కమిషనర్ కె. రవి కుమార్

## ప్రజా పాలన హెల్ప్ డెస్క్ లు ప్రారంభం

బుద్వేల్, జూన్26(ప్రభాత ఉదయం) బీ రాజేంద్రనగర్ వార్డు కార్యాలయంలో బుధవారం ప్రజాపాలన హెల్ప్ డెస్క్ ను సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కె. రవికుమార్ డిప్యూటీ ప్రాజెక్ట్ ఆఫీసర్ రాధారాణి, వార్డు కార్యాలయం ఇంచార్జ్ పద్మావతి తో కలిసి ప్రారంభించారు. నెలకు 200 యూనిట్ల లోపు కరెంట్ బిల్లు వచ్చేవారు వార్డు కార్యాలయానికి వచ్చి దరఖాస్తు చేసుకోవాలన్నారు. సబ్సిడీ గ్యాస్ గురించి కూడా హెల్ప్ డెస్క్ లో సమాచారం అందించడం జరుగుతుందన్నారు.



రాజేంద్రనగర్ జలమండలి జీఎం ఎన్ సాయి లక్ష్మికి శుభాకాంక్షలు తెలిపిన ఉద్యోగులు

## ఉద్యోగులు మంచినీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా పనిచేయాలి: జీఎం సాయి లక్ష్మి

రాజేంద్రనగర్, జూన్ 26(ప్రభాత ఉదయం) మంచినీటి సరఫరా లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉద్యోగులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని రాజేంద్రనగర్ జలమండలి డివిజన్ జీఎం ఎన్ సాయి లక్ష్మి సూచించారు. బుధవారం నూతన జీఎం గా పదవీ బాధ్యతలు స్వీకరించిన సాయి లక్ష్మిని ఉద్యోగులు కలిసి పుష్ప గుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సాయి లక్ష్మి మాట్లాడుతూ... ఉద్యోగులు సమన్వయంతో పనిచేసే సంస్థకు మంచి పేరు తీసుకురావాలన్నారు. నీటి సరఫరాతో పాటు సంస్థకు రావలసిన మంచినీటి బిల్లు వసూలు పై ఉద్యోగులు సిబ్బంది దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీజీఎం జమీల్, ఉద్యోగ సంఘం నాయకుడు జావిద్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థులంతా మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి




డ్రగ్స్ కు దూరంగా ఉందాం అంటు నిర్వహించిన ర్యాలీ కి జెండా ఊపి ప్రారంభిస్తున్న రాజేంద్రనగర్ డీసీపీ సీహెచ్ శ్రీనివాస్



మాట్లాడుతున్న రాజేంద్రనగర్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్



అవగాహన సదస్సులో పాల్గొన్న ఎన్ సీ సీ, ఎన్ ఎస్ ఎస్ విద్యార్థులు

బుద్వేల్, జూన్26(ప్రభాత ఉదయం): రాజేంద్ర నగర్ సర్కిల్ పరిధిలోని వెటర్నరీ కాలేజీలో ప్రపంచ డ్రగ్స్ దినోత్సవం సందర్భంగా బుధవారం అవగాహన సదస్సును రాజేంద్రనగర్ పోలీసులు ఏర్పాటు చేశారు.. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాజేంద్రనగర్ జోన్ డీసీపీ సి.హెచ్ శ్రీనివాస్ పాల్గోనీ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా కు వ్యతిరేక అంశాలపై అన్ని విధాలుగా విద్యార్థులకు అవగాహన కల్పించారు.. విద్యార్థులంతా మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు.. మాదకద్రవ్యాలకు బానిసై తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని ప్రతిజ్ఞ చేయించారు.. అనంతరం 500 మంది కు పై విద్యార్థులందరూ కలిసి సే నో టూ డ్రగ్స్, సేవ్ లైఫ్ అని నినాదాలతో వెటర్నరీ కాలేజ్ నుంచి డైరీ ఫార్మ్ చౌరస్తా తిరిగి కాలేజ్ వరకు ఓ ర్యాలీ నిర్వహించారు.. కార్యక్రమంలో వెటర్నరీ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఉదయ్ కుమార్, ఎన్ సీ సీ ఆఫీసర్ డాక్టర్ విజయ్, రాజేంద్రనగర్ ఇన్స్ పెక్టర్ బి. నాగేంద్ర బాబు లు పాల్గొన్నారు.



వ్యవసాయ విశ్వవిద్యాలయం ను సందర్శించిన థాయ్ లాండ్ మేఫా యూనివర్సిటీ ప్రొఫెసర్లు

## వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని సందర్శించిన థాయ్ లాండ్ మేఫా యూనివర్సిటీ ప్రొఫెసర్లు

బుద్వేల్, జూన్26(ప్రభాత ఉదయం): థాయిలాండ్ కు చెందిన స్కూల్ ఆఫ్ ఆగ్రో ఇండస్ట్రీ ఆఫ్ మేఫా యూనివర్సిటీ ప్రొఫెసర్లు మంగళవారం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. పరిపాలన భవనంలో రిజిస్ట్రార్ డాక్టర్ రఘురామి రెడ్డి, ఇతర విశ్వవిద్యాలయ ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. మేఫా యూనివర్సిటీ చేపడుతోన్న అకడమిక్ కార్యక్రమాల గురించి ప్రొఫెసర్ల బృందం వివరించింది. పండ్లు, కూరగాయలలో పంటకోత అనంతర టెక్నాలజీ, ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, వంటి అంశాలలో ఉన్న అవకాశాల గురించి చర్చించారు. అలాగే విద్యార్థులు, ఫ్యాకల్టీ, ఎక్స్చేంజ్ ప్రోగ్రామ్స్ గురించి కూడా చర్చించారు. ఇరు సంస్థలు పరస్పర సహకారంతో ఏయే అంశాలలో కలిసి పనిచేయాలన్న అంశాలపై కూడా ఇరు సంస్థల అధికారులు చర్చలు జరిపారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం అంతర్జాతీయ కార్యక్రమాల విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం ఉన్నతాధికారులు, ఇక్రిశాట్ కు చెందిన ఇన్నోవేషన్ హబ్ , డిజిటల్ అగ్రికల్చర్ హెడ్ డాక్టర్ ఆర్. శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ బ్యాంక్ సహకారంతో విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

గ్రామీణ బ్యాంక్ సౌజన్యంతో విద్యార్థులకు సైకిల్ పంపిణీ





విద్యార్థినికి సైకిల్ అందజేస్తున్న బ్యాంక్ మేనేజర్

గద్వాల(నందిన్నె) ఏపీ గ్రామీణ వికాస్ బ్యాంక్ సౌజన్యంతో నందిన్నె జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థులకు సైకిలను అందజేశారు. బుధవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సిఆర్పిఎఫ్ ల ఆధ్వర్యంలో సైకిళ్ల పంపిణీ చేశారు . ఈ సందర్భంగా సి ఆర్ పి ఎఫ్ కన్వీనర్ వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ... పూజారి తండా ,సుల్తాన్ పురం గ్రామం నుండి నందిని హై స్కూల్ కి రావడానికి ఉదయం ఆరు కిలోమీటర్లు సాయంత్రం ఆరు కిలోమీటర్లు కాలినడకన ద్వారా బడికి రావడం ఇబ్బందిగా ఉంది పిల్లలు స్కూల్కు రాకుండా డ్రాప్ అవుతున్నారు పిల్లలకు చదువులు ఎక్కడ ఆటంకం కలగకుండాగా ఉండాలని గ్రామీణ బ్యాంక్ మేనేజర్లు దినేష్ , రామాంజనేయులు సైకిళ్లను ఇప్పించారు. తమ పిల్లలకు సైకిల్ సైకిళ్లు ఇప్పించినందుకు పిల్లలు వారి తల్లిదండ్రులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ముఖ్య అతిథులు ఎం వి ఎఫ్ స్టేట్ చీఫ్ కోఆర్డినేటర్ రాజేంద్రప్రసాద్ , ప్రధానోపాధ్యాయులు విజయ భాస్కర్ , సీఆర్పీఎఫ్ కన్వీనర్ పాల వెంకటేశ్వర్ రెడ్డి, కో కన్వీనర్ వీరన్న ,సభ్యులు ఆంజనేయులు, నాగిరెడ్డి టీచర్స్ ఎం వి ఎఫ్ జిల్లా కోఆర్డినేటర్ సాయికుమార్, మండల్ ఇంచార్జి కిరణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి పౌరుడు బాధ్యతగా కృషి చేయాలి: జడ్పీ చైర్ పర్సన్ సరిత



డ్రగ్స్ వల్ల చేకూరే నష్టాన్ని ప్రజలకు తెలియజేసేందుకు ర్యాలీ నిర్వహిస్తున్న జిల్లా కలెక్టర్ బి ఎస్ సంతోష్, జడ్పీ చైర్మన్ సరిత



అవగాహన ర్యాలీలో జడ్పీ చైర్మన్ సరిత

గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 26(ప్రభాత ఉదయం)జోగులాంబ గద్వాల జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి పౌరుడు బాధ్యతగా కృషి చేయాలని జడ్పీ చైర్ పర్సన్ సరిత పిలుపునిచ్చారు. బుధవారం మాదకద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణా అంతర్జాతీయ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గద్వాల కృష్ణవేణి చౌరస్తాలో మిషన్ పరివర్తన పేరుతో నిర్వహించిన అవగాహన ర్యాలీని జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్, ఎస్పీ టి .శ్రీనివాసరావుతో కలిసి జడ్పీ చైర్పర్సన్ సరిత ప్రారంభించారు. పాత బస్టాండ్ వరకు నిర్వహించిన ర్యాలీ అనంతరం ఆమె మాట్లాడుతూ, డ్రగ్స్ తీసుకోవడం వలన కలిగే నష్టాలపై విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ అవగాహనతో ముందుకెళ్లాలన్నారు. డ్రగ్స్ నిర్మూలనకు యువత తమ వంతు కృషి చేయాలని సూచించారు. విద్యార్థులు చదువుపైనే దృష్టి పెట్టి తమ భవిష్యత్తును గొప్పగా తీర్చిదిద్దు కోవాలని, మాదకద్రవ్యాల బారిన పడితే జీవితాంతం బాధపడాల్సి వస్తుందన్నారు. మాదకద్రవ్యాల నిర్మూలన కొరకు పోలీసులే కాకుండా ప్రతి ఒక్కరు తమ బాధ్యతగా స్వీకరించి అరికట్టేందుకు కృషి చేయాలన్నారు. జీవితంలో స్థిర పడాల్సిన సమయంలో దురలవాట్లకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని, రాబోయే భవిష్యత్తును బంగారు బాటలు వేసుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ మాట్లాడుతూ... 1989 నుంచి ఈ దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం జరుపుకుంటున్నామని, దీని ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. డ్రగ్స్ అమ్మే వారి గురించి పౌరులు తమ బాధ్యతగా పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. డ్రగ్స్ బారిన పడిన యువతను కుటుంబ సభ్యులు అవసరమైన చికిత్స చేయించాలని కోరారు. జిల్లా ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో బాధితులకు మెరుగైన వైద్య చికిత్సలు అందించడం జరుగుతుందన్నారు. 17-18 ఏళ్లలోపు యువత డ్రగ్స్ బారిన పడేందుకు ఎక్కువగా అవకాశం ఉందని, ఈ సమయంలో వీరికి డ్రగ్స్ వలన కలిగే నష్టాల గురించి వివరించాల్సిన అవసరం ఉందన్నారు. డ్రగ్స్ బారిన పడకుండా విద్యార్థులు చక్కగా చదువుకోవాలని శారీరకంగా, మానసికంగా బలంగా ఉండవచ్చని పేర్కొన్నారు. యువత మత్తు పానీయాలు, సిగరెట్లు, గుట్కాలు, గంజాయి లాంటి మత్తు పదార్థాలకు అలవాటు పడి తమ విలువైన ఆరోగ్యాన్ని పాడు చేసుకోవద్దన్నారు. జిల్లా ఎస్పీ శ్రీనివాస రావు గారు మాట్లాడుతూ, పౌరులు మాదకద్రవ్యాలకు బానిసలు కాకుండా మాదక దవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా పటిష్టమైన చర్యలు చేపట్టిందని, జిల్లాలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో కూడా మాదకద్రవ్యాల నిర్మూలన కొరకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో యాంటీ నార్కోటెక్ బ్యూరో ఏర్పాటు చేసి ప్రత్యేక సిబ్బందిని నియమించినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు.విద్యార్థులు అందరు ఈ దశ నుండే మాదక ద్రవ్యాల వల్ల జరిగే దుష్పరిణామాల గురించి అవగాహన పెంచుకొని కుటుంబ సభ్యులకు , తమ గ్రామలలో ప్రజలను చైతన్యం చెయ్యాలని అన్నారు. రాష్ట్రంలో కి మాదక ద్రవ్యాల ను రాకుండ చూసే బాధ్యత ప్రతి ఒక్కరి పై ఉందని, ఎట్టి పరిస్థితుల్లోనూ డ్రగ్స్ రాష్ట్రం లోకి రాకుండ చూడాలని, డ్రగ్స్ నిర్మూలన ప్రతి ఒక్కరు తమ బాధ్యతగా భావించి వీటి బారిన పడకుండా యువత సురక్షితంగా ఉండాలన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ డ్రగ్స్ నివారణకు సంబంధించిన ప్రతిజ్ఞను విద్యార్థులు, అధికారులతో చేయించారు. డ్రగ్స్ నిర్మూలనపై విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీలులో విజేతలుగా నిలిచిన వారికి ముఖ్య అతిథులు ప్రశంసా పత్రాలు అందజేశారు. 'ఐయాం యాంటీ డ్రగ్ షోల్డర్' అనే పేరుతో ఏర్పాటు చేసిన సెల్ఫీ పాయింట్ వద్ద జడ్పీ చైర్ పర్సన్ సరిత, కలెక్టర్ బి. ఎం. సంతోష్, ఎస్పీ టి .శ్రీనివాసరావు, తదితరులు సెల్ఫీలు దిగారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారిని సుధారాణి, అదనపు ఎస్పీ గుణశేఖర్, డి . ఎస్పీ సత్యనారాయణ వివిధ శాఖల అధికారులు, విద్యార్థులు, యువత, స్థానిక ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.







హాస్పిటల్‌పై దాడిని నిరసిస్తూ నిరసన వ్యక్తం చేస్తున్న ఆర్ఎంపీ డాక్టర్లు

## ప్రైవేటు ఆసుపత్రులపై దాడులకు నిరసనగా ఆర్ఎంపీ వైద్యుల నిరసన

గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 26(ప్రభాత ఉదయం)ప్రైవేటు ఆసుపత్రులపై దాడులకు నిరసనగా బుధవారం జిల్లాలోని అన్ని ప్రైవేటు ఆసుపత్రులలో మూడు రోజుల పాటు వైద్య సేవలు నిలిపివేశారు. వీరికి మద్దతుగా జోగులాంబ గద్వాల జిల్లా ఆర్ఎంపీ %డ% పీఎంపి వెల్ఫేర్ అసోసియేషన్ సంఘం అధ్యక్షుడు విజయ్ అధ్వర్యంలో నిరసన చేపట్టారు. జిల్లాలో ఉన్న ఆర్ఎంపీ పీఎంపీ ల తరుపున ఈ దాడులను ఖండిస్తున్నామని అధ్యక్షుడు విజయ్ తెలిపారు.క్వాలిఫై డాక్టర్ కు మా మద్దతు ప్రకటిస్తూ 3 రోజుల పాటు తమ ప్రథమ చికిత్స కేంద్రాలు మూసివేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో విశేశ్వర ఆచారి, సుధాకర్, ఇబ్రహీం,దరూర్ అంజి, నౌసద్,అమరావయి నర్సింహ, నరేష్, రాము, వెంకటేష్,శేఖర్ తదితర ఆర్ఎంపీ డాక్టర్ లు పాల్గొన్నారు.



## జనావాసాల మధ్య పేలుళ్లు సమంజసమేనా?

### పేలుళ్లకు మైనింగ్,పోలీస్ శాఖల అనుమతి

### నిబంధనలు ఏ మేరకు పాటిస్తున్నారన్న దానిపై అనుమానం

### బాలాజీ టౌన్షిప్‌లో పేలుళ్లతో స్థానికుల బెంబేలు

### షాద్ నగర్ పోలీస్ స్టేషన్లో స్థానికుల ఫిర్యాదు

షాద్‌నగర్ జూన్ 26 (ప్రభాత ఉదయం):ప్రమాదకరమైన జిల్లెడెన్ స్టిక్స్ తో కొండలను గుట్టలను పిండి చేస్తున్న వ్యవహారాల్లో కనీస నిబంధనలు నిర్వాహకులు పాటిస్తున్నారా లేదా అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి. కొండలు,గుట్టలు పగలగొట్టడానికి జనావాసాల మధ్య అనుమతి ఉంటుందా? ఉండదా! అన్న విషయం పక్కన పెడితే షాద్ నగర్ పట్టణ శివారులోని సిరిసంపదలు టౌన్షిప్ ఎల్.ఎల్.పీ ప్రాంతంలో ఈ మధ్య జరుగుతున్న పేలుళ్లతో స్థానికులు బెంబలెత్తిపోతున్నారు.ఈ వ్యవహారంపై విసిగి వేసారి చివరకు షాద్ నగర్ పోలీస్ స్టేషన్లో ప్రజలు లిఖితపూర్వక ఫిర్యాదు ఇచ్చారు.ఈ బ్లాస్టింగ్లతో మమ్మల్ని కాపాడండి మహాప్రభో అంటూ గగ్గులు పెడుతున్నారు. బుధవారం సాయంత్రం బాలాజీ టౌన్షిప్ స్థానికులు పెద్ద మొత్తంలో జనాలు స్థానిక పోలీస్ స్టేషన్ కు చేరుకొని స్టేషన్ అధికారికి ఫిర్యాదు చేశారు.అయితే ఈ ఫిర్యాదు అందుకున్న పట్టణ సీఐ ప్రతాప్ లింగం అక్కడ జరుగుతున్న బ్లాస్టింగ్లకు అనుమతి ఉందని,అయితే అక్కడ నిబంధనలు ఏ మేరకు పాటిస్తున్నారు అన్న విషయమై పరిశీలన జరపాలని చెప్పారు.స్థానికుల నుండి ఫిర్యాదు వచ్చింది కాబట్టి దర్యాప్తు చేస్తామని సీఐ మీడియా అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పారు.బాలాజీ టౌన్షిప్ ప్రాంతంలో తరచూ పేలుళ్ల వల్ల రాళ్లు వచ్చి తమ ఇంటి డాబాలపై పడుతున్నాయని,కాలనీలో పలుచోట్ల పెద్దపెద్ద రాళ్లు పడుతున్నాయని దీనివల్ల ఎంతో ప్రమాదం పొంచి ఉందని స్థానికులు లంకాల రాఘవేందర్ రెడ్డి తదితరులు మీడియా దృష్టికి తెచ్చారు.ఇలాగే శబ్దాలతో తమ కాలనీవాసులు భీతిల్లి పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.ఆ వెంచర్,ఆ కథ ఏమిటో మాకు తెలియదు కానీ తమ కాలనీ నైరుతి మూలలో నిత్యం ఈ పేలుళ్లతో తమ ఇండ్లు కూడా పగుళ్లు వస్తున్నాయని ఇంకా ఇల్లు కూలిపోయే ప్రమాదం కూడా ఉందని పెద్ద శబ్దాలతో తమకు వాతావరణ కాలుష్యము, శబ్ద కాలుష్యం నష్టం జరుగుతుందని జనావాసాల మధ్య ఇదేం పరిస్థితి అని లంకాల రాఘవేందర్ రెడ్డి మీడియా దృష్టికి తెచ్చారు.దీనిపై చర్య తీసుకోవాలని వెంటనే బ్లాస్టింగ్లు ఆపాలని అధికారులతో కోరుతున్నట్టు ఆయన మీడియాకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు.ఈ విషయమై స్థానికులు స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడం సమస్య ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. సాధారణంగా పేలుళ్లు చేపట్టాలంటే..? పేలుళ్లు చేపట్టాలంటే మైనింగ్ శాఖతోపాటు స్థానిక ఠాణాలోనూ అనుమతి తీసుకోవాలి.ఎన్ని జిలెటిన్ స్టిక్స్ తీసుకొచ్చారు? ప్రతి రోజు ఎన్ని వాడుతున్నారు? మిగిలినవి ఎన్ని నిల్వ ఉన్నాయి? తదితర వివరాలను స్థానిక పోలీసు స్టేషన్కు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలి.రాళ్ల గుట్టలకు రంధ్రాలు చేసి వాటిలో జిలెటిన్ స్టిక్స్ ఉంచి పేలుడు చేపట్టాడానికి సాంకేతిక సిబ్బంది ఉండాలి.ఈ నిబంధనలేవీ ఇక్కడ పాటించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.నిబంధనల ప్రకారం పేలుళ్లు చేపట్టాలంటే మైనింగ్ శాఖ నుంచి అనుమతి పొందాలి,ఇంకా అక్కడ అనేక జాగ్రత్తలు పాటించాలి ఎవరికి ఇబ్బందులు సృష్టించొద్దు.అనుమతి ఉంది కదా అని విచ్చలవిడిగా పేలుళ్లు జరుపుతూ జనావాసాల మధ్య ఇబ్బందులు సృష్టిస్తే వెంటనే అనుమతులు రద్దు చేయాల్సిన అవసరం ఉంది.కానీ ఈ నిబంధనా ఎక్కడా పాటించడం లేదు అన్న విమర్శలు వినిపిస్తున్నాయి.అధికారులు ఈ విషయమై స్థానికుల ఫిర్యాదు తీసుకున్నగా ఎలాంటి చర్యలు ఉంటాయో వేచి చూడాల్సిందే..

## ఓవైసీ లాంటివారితో దేశానికి ప్రమాదం

### ఇలాంటి వారిని పార్లమెంట్‌కు పంపడం ముప్పు

### అసదుద్దీన్ పార్లమెంట్ వ్యాఖ్యలపై మండిపడ్డ మాధవీలత





హైదరాబాద్, జూన్ 26 (ప్రభాత ఉదయం):పార్లమెంట్‌లో ఎంపీగా ప్రమాణ స్వీకారం సందర్భంగా హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ చేసిన వ్యాఖ్యలపై బీజేపీ నేత కొంపెల్ల మాధవీలత తీవ్రంగా స్పందించారు. ఒవైసీ పార్లమెంట్‌లో అల్లాహుఅక్బర్ తో పాటు జై పాలస్తీన్ అనడంపై ఆమె తీవ్ర అభ్యంతరం తెలిపారు. అల్లా అన్న నోటితో జై పాలస్తీన్ అనడం ఏంటని.. అతని ఉద్దేశాలు ఏంటని ప్రశ్నించారు. ఇలాంటి వారి వల్ల దేశ భద్రతకు ముప్పు అని.. తక్షణం ఇతణ్ని విచారణ చేయాల్సి ఉందని ఓ వీడియోను విడుదల చేశారు. 'పార్లమెంటులో జై బోలో భారత్ మాతాకీ అనాల్సిన నోటి నుంచి జై పాలస్తీనా అనే మాట ఆయన నోటి నుంచి వచ్చిందంటే.. దేశానికే దౌర్భాగ్యం. ఇలాంటివారిని ప్రోత్సహిస్తున్నందుకు 130 కోట్ల మంది భారతీయులు మనల్ని మనమే ప్రశ్నించుకోవాలి. రజాకార్ల నుంచి వచ్చి.. వారిని చంపి వారి ఎంఐఎం పార్టీని కైవసం చేసుకొని గత 40 నుంచి 50 ఏళ్ల నుంచి తెలంగాణలో పాలన చేస్తున్నారు. ఇక్కడ ఏ పార్టీ అధికారంలోకి వస్తుందో.. వీరికి మద్దతివ్వడం ఆనవాయితీగా వస్తోందని మండిపడ్డారు. తమ్ముడు చిటికె వేస్తాడు.. 15 నిమిషాల్లో ఖబడ్దార్ ఈ దేశాన్ని శ్మశానం చేస్తా అంటాడు. నేను ఆపాను కాబట్టే అతను ఆగుతున్నాడు.. లేదంటే ఏం చేస్తాడో చూస్కోండి అని అన్న అంటాడు. వీరు ఏం చేస్తారు? జై పాలస్తీన్ అని పార్లమెంట్‌లో అన్నప్పుడు వీరి మనస్తత్వం ఏంటి? ఇలాంటి వారిని మనం పార్లమెంట్‌లోకి తీసుకొచ్చి కూర్చోబెడుతున్నాం. ప్రశ్నించేవారు లేరా? ఈ దేశ సంరక్షణ ఏ దిశగా వెళ్తోంది. 130 కోట్ల జనాభా మధ్యలో ఇలాంటి వారు మనతో ఉండడమే కాకుండా.. అక్రమ మార్గంలో ప్రజాప్రతినిధులై పార్లమెంటులో కూర్చొంటే దానికి రక్షణ ఎక్కడుంది? వీరు హమాస్ వాళ్లా? వారి కోసం పని చేస్తారా? హమాస్ ఆశయాలను భారత దేశంలో అమలు చేయడానికో.. లేదా వారిని సంతృప్తి పర్చడం కోసం ఇక్కడ పని చేస్తున్నారా? ఏ దేశంలో అయినా పుట్టిన వారు అదే తన మాతృభాష, మాతృభూమిని పాటించి, అదే తన జీవిత లక్ష్యం అని అనుకుంటారు. వీరి ఉద్దేశం అలా లేదు. వీరెప్పుడూ పేరు, ప్రఖ్యాతి, డబ్బు కోసం పరితపించే వికృతమైన వ్యక్తులు వీరు. భగవత్ నామం అల్లా అని పేరు చెప్పి.. జై పాలస్తీన్ అన్నాడంటే.. అతని మనస్సులోంచి వచ్చిన మాటలివి. అతను ఎందుకు ఈ మాటలు అన్నాడు. కచ్చితంగా జాతీయ భద్రతా మండలి వారు ఒవైసీని కూర్చోబెట్టి ప్రశ్నించాలి. అతని మదిలో ఏ ఆలోచనలు ఉన్నాయో తేల్చాలి. ఇప్పుడు కనుక మనం మేల్కోకపోతే, పరిష్కరించుకోకపోతే.. ఈ భారత్ శత్రువులకు పాలు పోసి పెంచినట్లు అవుతుంది' అని మాధవీ లత అన్నారు.

## రాష్ట్రంలో రహదారులకు నిధులు

### తెలంగాణకు వరంగా రీజినల్ రింగ్ రోడ్డు

### డిప్యూటి సిఎం మల్లు భట్టి విక్రమార్క వెల్లడి



న్యూఢిల్లీ, జూన్ 20 (ప్రభాత ఉదయం): రాష్ట్రంలోని జాతీయ రహదారుల సహా అనేక అంశాలపై కేంద్ర రోడ్లు, రవాణా శాఖ మంత్రి గడ్కరీతో చర్చించినట్లు తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. రీజనల్ రింగ్ రోడ్, హైదరాబాద్ విజయవాడ రహదారిని ఆరు లేన్లుగా మార్చే అంశంపై గడ్కరీతో చర్చించామని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు కలిసి పలు అంశాలను గడ్కరీ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. రాష్ట్రానికి అన్ని రకాలుగా సహకారం అందించాలని గడ్కరీని కోరామని.. అందుకు ఆయన సానుకూలంగా స్పందించారని భట్టి విక్రమార్క తెలిపారు. ఈ ప్రాజెక్టు తెలంగాణకు ఒక వరంగా మారుతుందని చెప్పారు. కేంద్రం స్పందించిన తీరుపై తాను సంతోషిస్తున్నట్లు అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. విజయవాడనాగ్ పూర్ హైవేతో పాటు ఇతర రింగ్ రోడ్డుల విస్తరణ అంశాన్ని కూడా ప్రస్తావించినట్లు తెలిపారు. వీటితో పాటు సర్వీస్ రోడ్లు, గ్రామాలకు సంబంధించిన క్రాసింగ్ రోడ్లపై కూడా సానుకూలంగా స్పందించినట్లు స్పష్టం చేశారు. హైదరాబాద్ ? కల్వకుర్తి కొత్త రోడ్ల నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనను కేంద్ర రోడ్లు, రవాణా శాఖమంత్రి నితిన్ గడ్కరీ దృష్టికి తీసుకెళ్లినట్లు వెల్లడించారు. వీటన్నింటితో పాటు రాష్ట్రానికి రావల్సిన నిధులు, కేంద్ర విద్యాసంస్థలకు సంబంధించిన వాటిని కూడా అడిగినట్లు తెలిపారు. కేంద్రం ముందు ఉంచిన ప్రతిపాదనలకు సంబంధించి అన్ని సహాయ సహకారాలను రాష్ట్ర ప్రభుత్వం తరఫున అందజేస్తామని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు .

## ఎమర్జెన్సీ ఓ చీకటి అధ్యాయం

### సభలో ప్రస్తావించిన స్పీకర్ ఓం బిర్లా

### విపక్షాల తీవ్ర అభ్యంతరం మధ్య సభలో మౌనం పాటింపు

న్యూఢిల్లీ, జూన్ 20 (ప్రభాత ఉదయం): లోక్‌సభ స్పీకర్‌గా వరుసగా రెండోసారి ఎన్నికైన ఓం బిర్లా సభలో చేసిన తొలి ప్రసంగం సందర్భంగా ఆయన 'ఎమర్జెన్సీ అంశాన్ని ప్రస్తావించారు. అత్యయిక స్థితి నాటి విషాదాన్ని గుర్తుచేసుకుంటూ సభలో మౌనం పాటించారు. అయితే, స్పీకర్ ప్రసంగంపై కాంగ్రెస్ సహా విపక్షాలు అభ్యంతరం వ్యక్తం చేశాయి. సభాపతిగా ఎన్నికైన ఓం బిర్లాకు ప్రధాని మోదీ, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సహా సభ్యులు అభినందనలు తెలిపారు. అనంతరం ఓం బిర్లా 'ఎమర్జెన్సీ'పై తీసుకొచ్చిన తీర్మానాన్ని చదవి వినిపించారు. 1975 జూన్ 25 మన దేశ చరిత్రలో చీకటి అధ్యాయంగా మిగిలిపోయింది. ఆ రోజున అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ ని విధించారు. అంబేడ్కర్ రాసిన రాజ్యాంగాన్ని అపహాస్యం చేశారు. ప్రపంచంలోనే మనం అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా గుర్తింపు సాధించాం. ఆ ప్రజాస్వామ్య విలువలు, చర్చలు దేశాన్ని ముందుకు నడిపిస్తాయి. కానీ, నాటి ప్రధాని ఇందిరాగాంధీ నియంతృత్వాన్ని అమలు చేశారు. ప్రజాస్వామ్య సూత్రాలు, భావ వ్యక్తీకరణ స్వేచ్ఛను అణగదొక్కారు. ప్రతిపక్ష నేతలను జైల్లో పెట్టారు. వీరేడియాపై ఆంక్షలు విధించారు. యావత్ దేశం కారాగారంగా మారిపోయిందని స్పీకర్ గుర్తుచేశారు. నాటి ప్రభుత్వం ఎమర్జెన్సీ విధించడాన్ని ఈ సభ తీవ్రంగా ఖండిస్తోందని తెలిపారు. ప్రజాస్వామ్య రక్షణ కోసం అత్యయిక స్థితిని ఎదిరించిన వారిని తాము అభినందిస్తున్నామని ఓం బిర్లా అన్నారు. అనంతరం నాటి చీకటి రోజులకు నివాళిగా సభలో ఒక నిమిషం పాటు మౌనం పాటిద్దామని సభ్యులను కోరారు. అనంతరం సభను గురువారానికి వాయిదా వేశారు. అయితే, స్పీకర్ మాట్లాడుతున్న సమయంలో కాంగ్రెస్ సహా విపక్ష నేతలు నిరసన వ్యక్తం చేశారు. స్పీకర్ ప్రసంగంపై ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు. ఎమర్జెన్సీని స్పీకర్ తీవ్రంగా ఖండించినందుకు చాలా సంతోషంగా ఉంది. ప్రజాస్వామ్యం గొంతు నొక్కి అప్పటి ప్రభుత్వం సాగించిన అన్యాయాలను ఆయన ఎత్తిచూపారు. దాదాపు 50 ఏళ్ల క్రితం దేశంలో అత్యయిక స్థితిని విధించారు. దాని గురించి నేటి తరం తెలుసుకోవడం చాలా ముఖ్యం. రాజ్యాంగాన్ని తుంగలో తొక్కి.. ప్రజాభిప్రాయాన్ని అణచివేసి, సంస్థలు నాశనం చేసినప్పుడు సమాజం ఎలా ఉంటుందో చెప్పేందుకు నాటి రోజులే సరైన ఉదాహరణ. నియంతృత్వం ఎలా ఉంటుందో ఎమ్జెంగన్సీ పరిస్థితుల నుంచి తెలుసుకోవచ్చు' అని మోదీ 'ఎక్స్' ఖాతాలో రాసుకొచ్చారు.

## ప్రజ్వల్ రేవణ్ణకు చుక్కెదురు

### బెయిల్ అభ్యర్థనను తోసిపుచ్చిన కోర్టు



బెంగళూరు, జూన్ 20 (ప్రభాత ఉదయం): లైంగిక దాడుల ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ ఎంపీ, జేడీ(ఎస్) బహిష్కృత నేత ప్రజ్వల్ రేవణ్ణకు చుక్కెదురైంది. ఆయన దాఖలు చేసిన బెయిల్ అభ్యర్థనను ఈ కేసును విచారిస్తున్న ప్రత్యేక ప్రజా ప్రాతినిధ్య కోర్టు బుధవారంనాడు తోసిపుచ్చింది. హోలెనరసిపుర పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసులో ప్రజ్వల్, ఆయన తండ్రి హెచ్‌డీ రేవణ్ణ నిందితులుగా ఉన్నారు. లైంగిక నేరాల కేసులో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్) కస్టడీలో ప్రస్తుతం ప్రజ్వల్ ఉన్నారు. ప్రజ్వల్ రేవణ్ణ ప్రమేయం ఉన్నట్టు చెబుతున్న లైంగిక దాడుల వీడియోలు 2024 లోక్‌సభ ఎన్నికలకు ముందు వెలుగులోకి రావడం ఒక్కసారిగా సంచలనమైంది. దీనిపై కర్ణాటక ప్రభుత్వం 'సిట్'ను ఏర్పాటు చేయగా, అప్పటికే జర్మనీ పారిపోయిన ప్రజ్వల్ సిట్ చర్యలతో దిగొచ్చారు. సిట్ విజ్ఞప్తితో బ్లూ కార్నర్ నోటీసును ఇంటర్‌పోల్ జారీ చేసింది. ఈ క్రమంలో మే 31న విచారణ కోసం జర్మనీ నుంచి తిరిగొచ్చిన ప్రజ్వల్‌ను సిట్ అదుపులోనికి తీసుకుంది. కాగా, పలువురు మహిళలపై లైంగిక వేధింపుల ఆరోపణలపై ప్రజ్వల్ రేవణ్ణ సోదరుడు సూరజ్ రేవణ్ణను కూడా పోలీసులు గత శనివారం అరెస్టు చేశారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: KOTLA CHANDRA KANTH. "RNI. Title- Code: TELTEL12231**. Cell: 9705231654.